


# వైభవంగా శివ కళ్యాణ మహోత్సవాలు

## మూడో రోజు ప్రత్యేక పూజలు.. ఏకాంతంగా వేడుకలు

**ప్రజానావ, వేములవాడ:** ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శివకళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మండప ఆరాధన, ఆవాహిత హోమం, ఔపాసనం మరియు బలిహరణం వంటి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో సదస్యం, ఔపాసనం, బలిహరణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అర్చకులు ఈ ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగుతుండగా, ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# నంది మేడారంలో రెండో మోటార్ ప్రారంభం

## జోగాపూర్‌కు 'ఎల్లంపల్లి' జలాలు



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చే దిశగా మరో ముందడుగు పడింది. నంది మేడారం పంప్ హౌస్‌లో శనివారం అధికారులు రెండో మోటార్‌ను విజయవంతంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జారీ చేసిన ప్రత్యేక ఆదేశాల మేరకు అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. నంది మేడారం పంప్ హౌస్ ద్వారా నీటి తరలింపు వేగవంతం కావడంతో, నారాయణపూర్ రిజర్వాయర్ నుండి వేములవాడ నియోజకవర్గంలోని జోగాపూర్ పంప్ హౌస్‌లోకి త్వరలోనే ఎల్లంపల్లి నీరు చేరనుంది. దీనివల్ల ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నిండటంతో పాటు సాగునీటి సరఫరా మెరుగుపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి విడుదలపై విప్ ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

# చంద్రంపేట పాఠశాలలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు

**ప్రజానావ, సిరిసిల్ల :** మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయనులకు, సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులకు మహిళా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కొండికొప్పుల రవి, మధుసూదన్, అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. స్త్రీ లేకుంటే జననం లేదు స్త్రీ లేకుంటే సమాజం లేదు స్త్రీ భవిష్యత్తు లేదు అని స్త్రీల ఔన్నత్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.పద్మ, అంజలి, మిరియం, దేవమ్మ, లత, జమున, అఖిల లను ఘనంగా సత్కరించారు.



# సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకం

- అడిషినల్ కలెక్టర్ తానాజీ వాకడే
- టీఎన్జీవోల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు



**ప్రజానావ, కరీంనగర్:** సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) అశ్విని తానాజీ వాకడే ఐఏఎస్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లా కేంద్రంలో టిఎన్ జివోల జిల్లా శాఖ ఆద్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన తల్లి ఇచ్చిన ప్రేరణే కారణమని తెలిపారు. "అమ్మ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాను కాబట్టే మొదటగా డాక్టర్ అయ్యాను... తర్వాత ఐఏఎస్ అయ్యాను. అమ్మే నా మొదటి గురువు" అని పేర్కొన్నారు. నవోదయ పాఠశాలలో తన విద్యాభ్యాసం ప్రారంభమైందని, తల్లి ఇచ్చిన విలువలు, క్రమశిక్షణే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకువచ్చాయని ఆమె పేర్కొన్నారు. తల్లి చదువుకోకపోయినా తనను బలంగా చదివించి ఈ స్థాయికి తీసుకువచ్చిందని భావోద్వేగంతో తెలిపారు. భవిష్యత్తులో తల్లి చెప్పిన పాఠాలను గౌరవంగా పాటించే వారు జీవితంలో తప్పకుండా ముందుకు సాగుతారని ఆమె అన్నారు .ఈ సందర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు మన సంస్కృతిలో ఎంతో గొప్ప స్థానం ఉందని పేర్కొన్నారు. మహిళలు చేసిన పోరాటాల ఫలితంగానే నేడు వారికి రక్షణగా అనేక చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం మహిళలకు మేటర్నిటీ లీవ్, పీటర్నిటీ లీవ్, చైల్డ్ కేర్ లీవ్, హెల్త్ కేర్ లీవ్ వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. నేడు మహిళలు అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు, డాక్టర్ నుంచి ఇంజనీర్ వరకు, రక్షణ రంగం నుంచి పరిపాలనా రంగం వరకు ప్రతి రంగంలో పురుషులకు దీటుగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. వెంకటరమణ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, సంఘం నాయకులు లక్ష్మణరావు, శారద, సబిత, సునీత, సరిత, విజయలక్ష్మి, హరిప్రియ, సుస్మిత, శైలజ, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, ఒంటెల రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్వింధర్ సింగ్, పోలు కిషన్, కోట రామస్వామి, శంకరయ్య, గంగారపు రమేష్, రాజేశ్వరరావు, సూర్యశ్రీ, లతా, రాధిక, విజయలక్ష్మి, వీణ, స్వర్ణలత, జ్యోతి శ్రీ, ధనలక్ష్మి, లలిత, మేరీ , కమలాకర్, కరుణాకర్, అస్గర్, రాజేష్, భరద్వాజ్, రాజేష్ సాయి తదితర వివిధ శాఖల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# పెద్దూరు పాఠశాలలో మహిళా దినోత్సవం

**ప్రజానావ, సిరిసిల్ల :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళల గొప్పతనాన్ని, మహిళా సాధికారత గురించి, మొదటి గురువు తల్లి అని, మహిళలందరూ ప్రతి రంగంలో రాణిస్తున్నారని, మహిళల గొప్పతనాన్ని తెలుసుకొని వారిని గౌరవించాలని, పూజించాలని ,దేవుడికి ప్రతిరూపమే మహిళ అని వక్తలు విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఆవరణలో ఉన్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను, 8వ వార్డ్ కౌన్సిలర్, మధ్యాహ్న భోజన కార్మికులను అంగన్వాడీ టీచర్, కార్యకర్తలను, ఆయమ్మలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఏఐపిసి చైర్ పర్సన్ తిప్పవరం సుధా, 8వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి లింగంపల్లి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ , కదర్ల కల్పన ,నాగుల వీణ, నందాల శంకర్, రాజమల్లు, రమాదేవి,లక్ష్మి, ఆశా కార్యకర్త లావణ్య, అంగన్వాడి టీచర్ రేణుక, భూమవ్వ, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్ప, సుగుణ, మమత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- మున్సిపల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు
- వివిధ రంగాల ప్రతిభా మూర్తులకు సన్మానం, జ్ఞాపకాల ప్రధానం



**ప్రజానావ, సిరిసిల్ల :** మహిళల సాధికారత, సమాన హక్కులు, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని సి నా రే కళా మందిరం లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మహిళా కౌన్సిలర్లు, పురపాలక సంఘం మహిళా ఉ ద్యోగులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో మహిళలు ముఖ్యమైన శక్తిగా నిలుస్తారని తెలిపారు. మహిళలు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ముందుకు సాగి ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మేమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. మహిళా ఉద్యోగులు, మహిళా నాయకులు తమ అనుభవాలను పంచుకుంటూ ఇతర మహిళలకు ప్రేరణగా నిలిచారు. మహిళల భద్రత, స్వావలంబన, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి కూడా ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. మహిళలు సమాజంలో గౌరవంతో ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకే 'ప్రజాపాలన ప్రణాళిక' ఎత్తుగడ



**ప్రజానావ, కరీంనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోవ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఇచ్చిన హామీలను దృష్టి మరల్చేందుకు మరోసారి ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో సరికొత్త నాటకానికి తెరదీస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని బిఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ దుయ్యబట్టారు. కరీంనగర్ లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాలకు ఆశలు చూపించి అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో ప్రతిగ్రామంలో మీటింగ్ లు పెట్టి ఆరు గ్యారెంటీల పేరుతో స్వీకరించిన ధరఖాస్తులకు ఇప్పటి వరకు దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ పాలకులు ఏం చేశారని ఏ మొఖంతో ప్రజల వద్దకు వస్తారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినా ప్రజలు ఏం చేయలేరనే ధీమాతో కాంగ్రెస్ నాయకులున్నారని, హామీలు అమలు చేయకుండా గ్రామాల్లోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీసి తరిమికొట్టాలన్నారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పాలకులు తమ వైఫల్యాన్ని అధికారులపై రుద్దేందుకు యత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలకుల కళ్లు తెరిపించే కార్యక్రమాన్ని కరీంనగర్ నుంచి మొదలుపెడదామని పిలుపునిచ్చారు. కరీంనగర్ తో పాటు ఎల్ఎండిపై తాగునీటి కోసం ఆధారపడ్డ ప్రజల గొంతు ఎండబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంచార్జి మంత్రి, కేంద్ర మంత్రి బండి సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తొంటి రాజేందర్, ఆరె రవి, చేతి చంద్రశేఖర్, బండి శ్రీకాంత్, నారదాసు వసంతరావు, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నాగుల కిరణ్ కుమార్ గౌడ్, సత్తినేని శ్రీనివాస్, నాయకులున్నారు.




## అప్పారెల్ పార్క్‌ను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

### వస్త్ర ఉత్పత్తుల పనితీరు పరిశీలన

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఇక్కడి వస్త్ర పరిశ్రమలను సందర్శించి ఉత్పత్తుల పనితీరును పరిశీలించారు. శనివారం ఈ సందర్భంగా పట్టణంలోని అప్పారెల్ పార్క్ ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుకారామ్, జస్టిస్ పుల్ల కార్తిక్, జస్టిస్ ఈ వి. వేణు గోపాల్, జస్టిస్ జె. శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వస్త్ర ఉత్పత్తుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన జరిగిన సందర్భంగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు అప్పారెల్ పార్కును సందర్శించారు.

## చీర్లవంచలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

### పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా నిర్మించిన ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, వారికి శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాల్లో సొంతింటి సంతోషం వెల్లివిరుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంట పొలాలకు సాగునీరు విడుదల

### రైతులకు అండగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### గుడి చెరువు తూము తెరిచిన అధికారులు..

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కీలక చర్యలు చేపట్టారు. శనివారం వేములవాడ పట్టణంలోని గుడి చెరువు తూము నుండి పంట పొలాలకు ఆయన సమక్షంలో అధికారులు నీటిని విడుదల చేశారు. తూము ద్వారా జలకళ సంతరించుకోవడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాగునీటి లభ్యతను పెంచేందుకు మిడ్ మానేరు నుండి గుడి చెరువులోకి నీటిని పంపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, గుడి చెరువు నుండి లక్ష్మీపూర్ పంట పొలాలకు కూడా సాగునీటిని మళ్లించి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఎండలు ముదురుతున్న తరుణంలో పంటలు ఎండిపోకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



# పట్టు చీరపై నారీ శక్తి స్ఫూర్తి చిత్రాలు




- మగ్గంపై చేనేత కళాకారుడు హరి ప్రసాద్ దంపతుల సృష్టి
- ఒకే చీర పై నారీ విజేతల చిత్రాలు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీమూర్తులకు హరిప్రసాద్ దంపతుల సృష్టి అంకితం

**ప్రజానావ, సిరిసిల్ల :** నారి శక్తి ప్రతిబింబించేలా మూడు నెలల పాటు శ్రమించి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన హరిప్రసాద్ రేఖా దంపతులు ప్రత్యేకంగా చేనేత మగ్గం పై పట్టుచీర నేశారు. నారీ శక్తి స్ఫూర్తితో గత ఏడాది మన దేశ ఆడబిడ్డలు ఎన్నో ఘన విజయాలు సాధించారు. ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్ తో మన దేశం మహిళల సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. క్రీడారంగంలోనూ మన ఆడబిడ్డలు ఎన్నో గొప్ప విజయాలు సాధించారు. వారి విజయాలన్నీటిని ప్రతిబింబించేలా చేనేత చీరను నేసి సిద్ధం చేశారు. మన దేశ గొప్పతనాన్ని చాటిన ఆడబిడ్డలు అందరికీ అభినందనలు తెలుపాలన్న ఉద్దేశంతో ఈ ప్రత్యేకమైన పట్టు చీరను నేయడం జరిగిందన్నారు. మన దేశ మహిళలు సాధించిన విజయాలు ఆపరేషన్ సింధూర్ తో పాటు షూటర్ సుజిత్ సింగ్ ముఖ చిత్రాలు, మహిళా క్రికెట్ వరల్డ్ కప్, మహిళా కబడ్డీ వరల్డ్ కప్, అంధుల మహిళా క్రికెట్ వరల్డ్ కప్ ఆర్చర్ సీతల్ దేవి జ్యోతి చిత్రాలు చీర పై హరి ప్రసాద్ నేశారు. ఇవి ఒకే చీరపై ఇమిడే విధంగా నేయడం జరిగింది. మన దేశ మహిళల విజయాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మరోసారి గుర్తు చేయాలని ఈ ప్రత్యేకమైన చీరను సిద్ధం చేశామని, ఈ చీర పై ఉన్న విజయాలను వారిని గుర్తు చేస్తూ వారికి అంకితం చేస్తున్నామని హరి ప్రసాద్ వెల్లడించారు.

# ముంబైలో 'దృశ్యం' తరహా హత్య

- భర్తను చంపి ఇంట్లోనే పాతిపెట్టిన భార్య!
- ప్రియుడితో కలిసి ఘాతుకం.. మృతదేహంపై టైల్స్ వేసి నిందితురాలి మాయాజాలం

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని నాలసోపారాలో బాలీవుడ్ చిత్రం 'దృశ్యం'ను తలపించేలా ఒక భయంకరమైన హత్యోదంతం వెలుగుచూసింది. తన అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో ఓ మహిళ, ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. నాలసోపారా తూర్పు గంగాడిపాడ ప్రాంతంలోని సాయి వెల్ఫేర్ సొసైటీలో విజయ్ చౌహాన్ తన భార్య గుడియా, ఎనిమిదేళ్ల కుమారుడితో కలిసి నివసిస్తున్నాడు. అయితే గుడియాకు మోను విశ్వకర్మ అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉంది. దీనిని భర్త విజయ్ వ్యతిరేకించడంతో, అతనిని అడ్డుతొలగించుకోవాలని గుడియా, ఆమె ప్రియుడు పథకం వేశారు. 15 రోజుల క్రితం విజయ్‌ను హత్య చేసిన నిందితులు, మృతదేహాన్ని ఇంట్లోని గదిలోనే పాతిపెట్టారు. నేరం బయటపడకుండా ఉండేందుకు, మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రదేశంపై తన మరిదితో టైల్స్ వేయించి ఏమీ తెలియనట్లు నటించింది.

### దుర్వాసనతో బయటపడ్డ దారుణం

విజయ్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా, గుడియా వారిని తప్పుదారి పట్టిస్తూ వచ్చింది. అయితే, రెండు రోజుల క్రితం ఆమె మొబైల్‌కు వచ్చిన కొన్ని అనుమానాస్పద సందేశాలు, ఇంట్లోంచి వస్తున్న విపరీతమైన దుర్వాసనతో విజయ్ బంధువులకు అనుమానం కలిగింది. వారు ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి, అనుమానం ఉన్న చోట తవ్వి చూడగా విజయ్ మృతదేహం కుళ్ళిన స్థితిలో లభ్యమైంది.

### పరారీలో నిందితులు

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ప్రస్తుతం నిందితురాలు గుడియా, ఆమె ప్రియుడు మోను ఇద్దరూ పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు. కన్నకొడుకు ఉన్నాడన్న జాలి కూడా లేకుండా భర్తను చంపి పాతిపెట్టిన ఆ మహిళ క్రూరత్వంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# వివిధ రంగాల్లో సేవలందించిన మహిళామూర్తులకు ఘన సత్కారాలు

- జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- అలరించిన ఆట పాటలు



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలలో సేవలందించిన మహిళలకు వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన అలాగే అందిస్తున్న మహిళలు చింతపల్లి వనజ (రిటైర్డ్ జాయింట్ కలెక్టర్), చిక్కాల శోభ (రిటైర్డ్ ఎంపీడీఓ), కులుగూరి రమాదేవి (రిటైర్డ్ టీచర్), ఎం ఉమారాణి ( తహసిల్దార్), దొంతినేని కల్యాణి గ ( సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్), డా. ఎర్రవెల్లి అనురాధ, సురభి రోహిణి (డీజీఎం), ఎర్ర వెల్లి లక్ష్మి, చీటీ సునీత, వెన్నమనేని లావణ్య , గన్నమనేని సువర్ణ, చిట్నేని మాధవి, జూపల్లి రమాదేవి, ఐల్నేని సుప్రియ, ఎర్రవెల్లి అంజన , గునుగంటి పద్మ లను మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సన్మానించారు. ఈ సందర్భంగా పిల్లలు పెద్దలు అందరూ ఆటలు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సంతోషంగా మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వెలమ సంఘం అధ్యక్షులు చెన్నమనేని కమలాకర్ రావు, ఉపాధ్యక్షులు రోకండ్ల వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి సురభి గాంధీ రావు, కోశాధికారి బొమ్మన భాస్కర్ రావు, జాయింట్ సెక్రటరీలు వెన్నమనేని వంశీ కృష్ణ, బొంత రజిత, ప్రచార కార్యదర్శి కల్వకుంట్ల నాగేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు ద్యావనపల్లి రమారావు, జువ్వాడి ప్రశాంత్ రావు, మెన్నెని హరీష్, కల్వకుంట్ల మమత, బోయినిపెల్లి లత లు పాల్గొన్నారు.

## నీటి కష్టాలు తీర్చండి

### అధికారులను ఆదేశించిన కాటూరి రమేష్

**ప్రజానావ, జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ బస్తీలో నెలకొన్న నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్ అధికారులను ఆదేశించారు. గత కొన్ని రోజులుగా బస్తీ ప్రజలు తాగునీటి సరఫరా సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో, ఆయన ఆదివారం వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాటూరి రమేష్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారి రాంబాబు మరియు సూపర్‌వైజర్ శ్రీనివాస్‌లను పిలిపించి, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా చూపించారు. నీటి సరఫరాలో ఉన్న అడ్డంకులను తొలగించి, బస్తీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటిని అందించాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వేసవి కాలం ప్రారంభం అవుతున్న తరుణంలో తాగునీటి విషయంలో ప్రజలకు ఎటువంటి కష్టాలు రాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు బస్తీ వాసులు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.





## పాఠ్యాంశాల్లో రాజ్యాంగాన్ని చేర్చాలి

### ఆసిఫాబాద్ కు చేరుకున్న రాజ్యాంగ రథయాత్ర

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** భారత రాజ్యాంగాన్ని 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠ్యాంశాల్లో ఒక ప్రత్యేక సబ్జెక్టుగా చేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'రాజ్యాంగ రథయాత్ర' ఎనిమిదవ రోజుకు చేరుకుంది. జై భీమ్ మహాసేన, మానవ హక్కుల పరిరక్షణ సంఘం, విశ్వజన కళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్ర శనివారం ఆసిఫాబాద్ చేరుకోగా, నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు గడు-స్తున్నా ప్రజలకు రాజ్యాంగంపై పూర్తి అవగాహన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. రాజ్యాంగాన్ని కేవలం ప్రమాణ స్వీకారాలకే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రభుత్వం తక్షణమే దీనిని విద్యా వ్యవస్థలో భాగం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ జి, అంజన్న, ఎస్తేరు రాణి, అలెగ్జాండర్ ప్రభు, బాలస్వామి, యాదక్క, రాబర్ట్ మరియు కెవిపిఎస్, డీ వై ఎఫ్ ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆహేరికి నో.. పెళ్లికి ఆర్థిక సహాయం



**ప్రజానావ, జైనూర్:** మండలంలోని కర్ణంగూడ గ్రామస్తులు ఓ మంచి నిర్ణయం తీసుకొని సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు.. పెళ్లిళ్ల సమయంలో నిర్వహించే ఆహేరి కార్యక్రమం (డబ్బాలు, బట్టలు వంటి బహుమతులు) ఇవ్వడాన్ని నిషేధిస్తూ, వాటికి ఖర్చయ్యే డబ్బును ఒకచోట జమ చేసి పెళ్లి చేసుకునే వారికి ఆర్థిక సహాయంగా అందించాలని నిర్ణయించారు. దీనిప్రకారం గ్రామస్తులు సేకరించిన రూ. 20వేల నగదును కుమ్రం సోనేరావు తనయుడు కుమ్రం దత్తు పెళ్లికి గ్రామ పెద్దలు, గ్రామస్తుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్ గేడం చందు మాట్లాడుతూ కర్ణంగూడ గ్రామంలో తీసుకున్న ఈ మంచి నిర్ణయాన్ని ప్రతిఒక్కరు పాటించాలని కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మన గ్రామంలో మాత్రమే కాకుండా ప్రతి గ్రామంలో నిర్వహించాలని, సామాజిక ఐక్యతను పెంపొందించే కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని సూచించారు. గ్రామస్తుల ఈ నిర్ణయం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తూ ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## పెండింగ్ రుణాలు మంజూరు చేయాలి



**ప్రజానావ, గుడిహత్నూర్:** పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్ పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్సీ సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్యాల కరుణాకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి దళిత నిరుద్యోగికి, అట్టడుగున ఉన్న లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించి వారి స్వయం ఉపాధికి తోడ్పడాలని కోరారు. కలిసిన వారిలో బుగ్గారం మాజీ సర్పంచ్ జాదవ్ వసంత్ రావు, జాంటి తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం కుమారుని వివాహ వేడుకల్లో బోరంచు

**ప్రజానావ, ఆదిలాబాద్:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డితో కలిసి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు జిల్లా నాయకులు ఉన్నారు.



## సెస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి



**ప్రజానావ, సిరిసిల్ల:** పెండింగ్ సమస్యలను పరిష్కరించే విషయంలో చొరవ తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సెస్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు సెస్ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం గంగాధరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. చాలా రోజులుగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో సెస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సెస్ అసిస్టెంట్ హెల్పర్లు ఎర్ర శ్రీనివాస్, పిట్టల చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహాభారత్‌నగర్‌లో 'ప్రగతి ప్రణాళిక'

- అధికారులకు విజయ రెడ్డి ఆదేశం
- శిథిలమైన రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి పట్టుబట్టిన కార్పొరేటర్

**ప్రజానావ, ఖైరతాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని మహాభారత్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరెడ్డి పర్యటించారు. బస్తీలోని మహిళలతో కలిసి గల్లీ గల్లీ తిరుగుతూ స్థానిక సమస్యలను ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు పూర్తిగా శిథిలమై గుంతలమయంగా మారడాన్ని చూసి ఆమె అసహనం వ్యక్తం చేశారు. అలాగే పలుచోట్ల సీవరేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని స్థానిక మహిళలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన విజయ రెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున, యుద్ధ ప్రాతిపదికన మహాభారత్ నగర్‌లో నూతన సీసీ రోడ్ల పనులను ప్రారంభించాలని మరియు పాడైపోయిన మ్యాన్‌హోళ్ల స్థానంలో కొత్త వాటిని నిర్మించాలని ఆమె ఆదేశించారు. ప్రజాపాలనలో భాగంగా గుర్తించిన ప్రతి సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరించి తీరుతామని



ఆమె బస్తీ వాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం దహేగాం మండలంలోని ఐనం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, టాయిలెట్లు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల





పరిసరాలను వారంలో ఒక సారి గ్రామ పంచాయతి మల్టీ పర్పస్ కార్మికులచే శుభ్రం చేయించాలని కలెక్టర్ అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త కుండీలలో వేయాలన్నారు. టాయిలెట్ గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరచుగా పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో అనేక మౌళిక వసతులు కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజానావ, ఆదిలాబాద్:** పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాయి అని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శనివారం ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక సరస్వతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'లక్ష్యం' కరదీపికను ఆవిష్కరించడంతో పాటు, 'ఆల్ ఇన్ వన్' స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లను కూడా దక్కించుకోవడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్, డాక్టర్, ఇంజనీర్ వంటి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి పదవ తరగతి ఫలితాలే పునాది అని, విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే తోటి స్నేహితులు, ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని అన్నారు. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడి ఉంటే 'టెలీ మానస్' హెల్ప్‌లైన్ నంబర్



ద్వారా సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. పరీక్షల మధ్య గ్యాప్ ఉన్న సమయంలో విద్యార్థులకు అందుబాటులో ఉండి సందేహాలను తీర్చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అవసరమైతే ఇతర పాఠశాలల సబ్జెక్టు నిపుణులను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, ఇంచార్జి డీఈఓ రాజేశ్వర్, డీసీఈబీ సెక్రటరీ గజేందర్, సెక్టోరల్ అధికారులు లక్ష్మణ్, అజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

